# "కన్న కడుపు" ★

శ్రీ సోమంచి రామం, బి. ఎస్. సి.

పోస్టుమన్ : కనకయ్యగారూ ! మీ కో కవరుందండీ !

కనకయ్య : నాకా ! ఏదీ ! ఇలాయియ్యి ! (కవరు చింపిన శబ్దం)

నాన్నగారికి,

నమస్కారములు. రెండేళ్ళనుంచి ఓపికతో జీవిస్తూ యిక ఉండబట్టలేక యీ ఉత్తరం వ్రాస్తున్నందుకు క్షమింపగోరుతాను. అమ్మకు నా నమస్కారములు. పిల్లలంతా క్షేమమని తలుస్తాను. అమ్మ కార్డు వ్రాసి సరిగా నేటితో రెండేళ్ళు పూర్తి అయినవి. ఆతర్వాత అక్కడి విషయాలు చూచాయగ తెలియటము తప్ప నాకెట్టి సంగతులు తెలియలేదు. నా పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. ఆబోతులమధ్య లేగదూడ నలిగి చచ్చినట్లయింది నా బ్రతుకు. అత్తమామలు అడకత్తెరలో పోకలాగ నలగగొట్టి చంపుతున్నారు. ఆయన సంగతి సరేసరి ! తల్లి దండ్రుల చేతులలో కీలుబొమ్మ. నాగతి మధ్యన అధోగతి పాలయింది. నాన్నగారూ ! నేనేం పాపం చేశానని మీకందరికీ నామీద అంత కోపం ! నా మామగారి మీద కోపం వచ్చి నాగురించే తల పెట్టడం మానేశారా ? అల్లారి ముద్దుగా పెరిగి ఆఖరికిలా తయారయింది నా బ్రతుకు ! వ్రాసి ప్రయోజనం లేదు. వీలయితే మీరు ఒకసారి కన్నకూతుర్ని కడసారి చూడాలంటే వెంటనే బయలుదేరి రావలసినదిగా కోర్తాను. ఒంట్లో ఆరోగ్యం అడుగంటిపోయింది. మాంసం కండలు పోగా మిగిలిన ఎముకలతోనున్న అస్థిపంజరమే మీకూతురు ప్రతిరోజూ ఆయన గొడ్డును బాదినట్లు బాదుతున్నారు. అడ్డమైన కొంపలు తిరిగి నానా రోగములు తెచ్చుకుని ఆ మలిన దేహముతో నే నున్న — అదే నా శరీర విషమస్థితికి కారణము. అట్టే కాలము ఉండేటట్లు లేను. బాగా ఆలోచించిన మీదట వ్రాస్తున్న ఉత్తరమిది. అమ్మకు నా నమస్కారములని చెప్పండి.

గత విషయాలను మరచి కన్నకూతురిపై కొంచమైన కనికరం కలిగితే రండి ! కడసారి మిమ్మల్నందర్నీ చూడాలని ఉంది. మీ రాకకు ఎదురుచూస్తుంటాను.

కన్నీళ్ళతో ముగిస్తున్న
మీ కన్నకూతురు
సరోజ.

(ఆవేశంలో) సరోజా ! అవును ! నేనెంత మూర్ఖుణ్ణి ! నా వియ్యంకుడికి నాకు మాట పట్టింపు వచ్చిందని మధ్య నీ విషయం పట్టించుకోకుండా ఉండటమా ! ఎంత తెలివి తక్కువ ! నువ్వేం తప్పు చేశావు ! ఈ తప్పంతా నాదే ! అమ్మ ఒకటి రెండు సార్లు నీవిషయం తెచ్చినా నేనే మూర్ఖంగా "ఛస్తే వాళ్ళ గుమ్మంలో అడుగు పెట్టనని" పట్టు పట్టాను. ఎంత నరకయాతనలను అనుభవించకపోతే యింత బాధతో రాస్తావు సరోజా ! (బిగ్గరగా అరుస్తాడు)

సత్యం : అదేమిటి కనకయ్యగారూ ! అలా అరచారు ! అవతల హెడ్‌మాష్టరు ఉన్నారు.

కన : ఓ ! సారీ ! మర్చిపోయాను ! ఎంత పొరపాటు జరిగింది !

స : అసలేం జరిగింది యింతకూ !

కన : మా అమ్మాయి ఉత్తరం వ్రాసింది. పాపం యమయాతనలు అనుభవిస్తోందిట. దీనికంతకూ నేను కారణం !

స : కొంచం వివరంగా చెప్పండి కనకయ్యగారూ !

కన : ఇది అప్పుడే అయిదేళ్ళ క్రిందటిమాట — పెళ్ళిరోజున జరిగిన విషయంమీద ఆధారపడింది అంతా. పెళ్ళయాక ... .....

◆ ◆ ◆

వియ్యంకుడు : అయితే కట్నం ఎప్పుడు పంపుతానంటారు బావగారూ !

కన: రేపు పంటలు రాగానే ముందు తీసికొని యిచ్చేస్తాను!

వి: పెద్దమనుషులు నలుగురూ ఉన్నారు కదాఅని ఊరుకుంటున్నాను. రేపు పంటలో కనక తీసికొచ్చి యివ్వకపోతే చూసుకోండి! మీకూ మాకూ తెగతెంపులే! మీ గుమ్మంలో అడుగుపెట్టే ఒట్టు!

కన: మీకేనా అంత పౌరుషం! మేం మాత్రం మీ గుమ్మంలో అడుగుపెట్టేటంతటి మూర్ఖులమా! మేమూ అడుగుపెట్టం!

వి: అంత పౌరుషం కలవాడివి కట్నం ముందే పడెయ్యలేకపోయావూ? మా లావు కబుర్లు చెప్తున్నావు!

కన: పడేస్తాను- ముష్టి అయిదు వేలు ఓ లెక్కకాదు- సమయానికి లెఖ్ఖ చేతికందలేదు గాని-

వి: అదే చూస్తాంగా! యివ్వలేక పోయావా! అంతే! తెగతెంపులే!

♦ ♦ ♦

కన: అలా తెగతెంపులే అంటూ బండెక్కాడు వియ్యంకుడు. దరిమిలాని దురదృష్టవశాత్తు గాలివాన వచ్చి పంటకాస్తా కొట్టుకు పోయింది. ఆ మరుసటి సం॥రం పంటరాగానే కొంత సొమ్ము వడ్డీకి తెచ్చి అయిదు వేలు పూడ్చి వియ్యంకుడిదగ్గరకు బయలుదేరాను. ఆయన ముష్టి కట్నం ఆయన ముఖాన్నకొట్టి యింటికి చక్కావచ్చాను. అప్పటినుంచి అక్కడి విషయాలు యిక్కడికి యిక్కడి విషయాలు అక్కడికి తెలియటం లేదు (బాధతో) యిన్నాళ్ళకు నా చిట్టితల్లి యిలా ఉత్తరం వ్రాసింది.

(స్కూలు గంట గణగణ మ్రోగుతుంది)

కన: వస్తాను సత్యంగారూ! యింటికి వెళ్ళాలి.

స: మంచిది. వెళ్ళి అమ్మాయిని తీసికొచ్చేయండి! పాపం! అభాగ్యుడు!

(విరామం)

భార్య: కాఫీ యిదిగోనండి! అదేం అలాగున్నారు ఒంట్లో బాగాలేదా! ఇదిగో! కాఫీ! తలనొప్పిగా ఉందా!

కన: ఫరవాలేదులే!

భా: ఉత్తరాలేమైనా వచ్చాయా!

కన: (గాద్గదికగాం) ఆ! పెద్దమ్మాయి రాసింది. వంట్లో బాగా లేదట. యిదిగో!

భా: (ఆతురతగా) ఏమన్నా ఎక్కువగా ఉందాండీ!

కన: (విచారంగా) చదువుకో! నే చెప్పలేకుండా ఉన్నాను.

భా: (ఏడుస్తూ) అమ్మాయి నెలాగైనా తీసికొనిరండీ!

కన: ఏ సుఖం పెట్టుకుని వెళ్ళనే అక్కడికి!

భా: అదేమిటండీ! కన్నకూతురు చావు బ్రతుకులమీద ఉంటే, మీకింకా మాటపట్టింపులేనా! అసలు వాళ్ళు మనుషులా రాక్షసులా! నా బిడ్డను నానా హింసా పెట్టి చంపేశారు. (ఏస్తూడు) ఏమండీ! వెళ్ళండి! అమ్మాయిని తీసికొనిరండి! మీకు బిడ్డ ప్రధానమా! పశువుల్లా ప్రవర్తించే ఆ రాక్షసులమాట ప్రధానమా! వెంటనే వెళ్ళండి. బిడ్డ యెలా ఉందో ఏమో!

కన: అవును! వెడతా! యెలాగైనా నా బిడ్డను తీసికొస్తాను!

భా: మబ్బుగా ఉంది. జాగ్రతగా వెళ్ళిరండి.

♦ ♦ ♦

(రైలు ఆగిన శబ్దం. జనం దిగుతారు. రైలు వెళ్ళిపోతుంది. వర్షం కురుస్తూంటుంది)

వి: ఎవరు కనకయ్యగారా! ఏం యిలా దయచేశారు?

కన: (గద్దిస్తూ) అవును! నేనే— మా అమ్మాయేదీ!

వి: ఏం యిప్పుడు కావాల్సి వచ్చిందా! ఆగదిలో ఉండాలి! ఉందోపో యిందో పోయి చూసుకో!

క: ఏమన్నావు? పోయిందా! నువ్వు మనిషివా రాక్షసివా! మనుష్యుల్ని పీక్కుతినే పిశాచానివి! నిన్ను చంపినా పాపంలేదు (కర్రతో కొట్తాడు)

వి: అమ్మా (అని పడిపోతాడు)

సరోజ: (నీరసంగా) నాన్నా!

కన: అమ్మా! సరోజా! ఆగమ్మా! యిక యిక్కడ ఉండదు! రా! పోదాం!

(వర్షం హోరున కురుస్తూంటుంది. రైలు వచ్చిన శబ్దం. ఆగి వెళ్ళిన శబ్దం)

కన: ఏయ్ ! బండీ! పాతబజారుకి బండీ కట్తావా !

బం: అర్ధరాత్రి 12 గం॥లకు వర్షంలో బండీ యెవరు కట్తారయ్యా ! అమావాస్య చీకటి కూడాను.

స : నడుస్తా నాన్నా !

కన: వద్దమ్మా ! నేనే తీసికెడతాను.

(వర్షం కురుస్తూనే ఉంటుంది)

స : (వాంతి చేసికుంటుంది. నీరసంగా) అమ్మా ! అమ్మా !

కన: ఎలా ఉందమ్మా ! సరోజా !

స : (నీరసంగా) ఒక్క క్షణం ఆగు నాన్నా !

కన: (భయంగా) సరోజా ! అమ్మా సరోజా ! ఎంత నీరసం వచ్చిందమ్మా ! అయ్యో దేవుడా ! ఈ అర్ధరాత్రి హోరు వర్షంలో ఈ అసహాయ స్థితిలోనా నీ పరీక్ష. సరోజా ! కలరా తగిలందమ్మా నీకు ! ఇక లాభంలేదు.

(తలుపు తట్టిన శబ్దం. తీసిన శబ్దం.)

భా : (ఆదుర్దాగా) ఏమిటండీ యిది ! అమ్మా ! సరోజా ! అయ్యో నా బిడ్డా ! (ఏడుస్తుంది)

స : అమ్మా ! ఆఖరిసారి నిన్ను చూశాను. చాలు !

(అంతా గొల్లు మంటారు.)

(లారీ ఆగిన శబ్దం - బూట్లచప్పుడు)

ఇనస్పెక్టరు: ఏయ్ ! కనకయ్య యెవరు ?

కన: నేనే నండి !

ఇన: ఏయ్ ! 244 ఇతన్ని అరెస్టు చెయ్యి.

భా : అయ్యో ! ఏమిటండీ యిదంతా !

ఇన: మీ వియ్యంకుణ్ణి కొట్టినందుకు అరెస్టు కనకయ్యగారూ ! 244 ! లారీలో ఎక్కించు !

భా. పిల్లలు : ఏమండీ ! నాన్నా ! అమ్మా !.

(లారీ పోయిన శబ్దం)

(వర్షం యింకా కురుస్తూనే ఉంటుంది.)




మీ బిడ్డ మామూలుగా భుజించనిచో

మందంగా వుండి, పొట్ట ఉబ్బివున్నచో, బహుశా కడుపులో బల్ల (లివర్) పెరుగుతుండవచ్చు. యీ లివర్ వ్యాధి సాధారణముగా 3 సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చుట సహజము.




జమ్మివారి

లివర్‌క్యూర్

లివర్ & స్ప్లీన్ వ్యాధుల చికిత్సకు, నివారణకు.




ఇప్పుడు మాత్రల రూపంలో లభిస్తున్నది.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్,
'జమ్మి బిల్డింగ్స్', మైలాపూర్, మద్రాసు.
శాఖ: పొరుగంటివారి వీధి, విజయనగరం సిటీ,
మరియు ఇతర స్థలములలో.